ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 2

శ్రీ సాయిబాబా జీవితం

II

రెండవసారి శిరిడీ చేరాకగూడ సాయి కొంత కాలం ఆ వేపచెట్టుక్రిందనే వున్నారు. ఆయన అప్పట్లో జుట్టు పొడుగ్గా పెంచుకొని తలకు తెల్లని రుమాలు, నడుముకు లంగోటి, పహిల్వానులా ఒకచొక్కా వేసుకొనేవారు. ఆయన ధనికులు - పేదలు, తమను గౌరవించేవారు తృణీకరించేవారు అనే భేదమెరుగని గంభీరుడు. ఆయన తరచుగా "అల్లాహ్"ను స్మరిస్తూ మశీదులోనో, గ్రామ పరిసరాలలోని చిట్టడవిలోనో, ఏటి ఒడ్డునున్న తుమ్మచెట్టు క్రిందనో ఒంటరిగా కాలం గడుపుతూండేవారు. తరచుగా తమలో తాము మాట్లాడుకొనేవారు. ఎదుట ఎవరూ లేకున్నా కోపంతో పెద్దగా తిడుతూనో, రాయి విసురుతానని బెదిరిస్తూనో వుండేవారు. దయ్యంపట్టిన వానిలా వున్నట్లుండి దూసుకుపోతుండేవారు. అందువలన ఆయనొక పిచ్చి ఫకీరని జనం తలచేవారు. లెండీదగ్గర ఒక పెద్ద తొట్టిలో గ్రామస్థులంతా పాత్రలు కడుక్కొనేవారు. ఆ నీరు పశువులు త్రాగేవి. చాలాకాలం సాయిగూడ అవే త్రాగేవారు. అందువలన గ్రామస్థులు ఆయనను మంచినీటి బావి దగ్గరకు రానిచ్చేవారుగారు. అయినా తాత్యా తల్లి బయాజాబాయి ఆయనకు చేసిన సేవ అనన్యం! ఆమె నిత్యమూ నియమంగా భోజనము ఒక బుట్టలో పెట్టుకొని ఆయనెక్కడున్నా వెతికి భోజనం పెట్టిగాని తానేమీ తినేది గాదు. ఒక్కొక్కసారి ముళ్ళూ, పొదలూ లెక్కచేయక చిట్టడవులలో గూడ ఆయన కోసం వెతకవలసి వచ్చేది. ఆయన ఏకాంతంగా ధ్యానంలో కూర్చొని వుంటే వారి ముందు ఆకువేసి వడ్డించి, కలిపి బిడ్డకు తినిపించినట్లే తినిపించేది. ఆమె శ్రమ చూడలేక కాబోలు, కొన్నాళ్ళకు ఆయన తిరగడం మాని మశీదులోనే వుండసాగారు. ఆమె చేసిన సేవను ఎన్నడూ మరువక ఆమెను, ఆమె బిడ్డడైన తాత్యాను కంటికి రెప్పలా కాపాడుతుండేవారు. చివరకు అతని ప్రాణం కాపాడడానికి తమ ప్రాణాన్నే అర్పించారని భక్తులంటారు. కృతజ్ఞతకు మరోపేరు సాయి.

ఒకసారి కొద్దిరోజుల పాటు తెంపులేకుండా కుంభవృష్టి కురిసి ఊరంతా నీరుపారాయి. వర్షం తగ్గేవరకు భక్తులు సాయి దర్శనానికి వెళ్ళలేకపోయారు. వాన వెలిసాక వెళ్ళిచూస్తే ఆయన ఆ నీళ్ళలోనే వేపచెట్టు క్రింద ధ్యానస్థులై కూర్చొని వున్నారు. నీరంతా పోయాక భక్తులు మరలా వెళ్ళి, "బాబా! మేమంతా సుఖంగా యిళ్ళల్లో వుంటే, మమ్మెప్పుడూ కాపాడే మీరు చెట్టుక్రింద కంటె మశీదులో వుంటే మాకు బాగుంటుంది" అని బ్రతిమాలారు. కాని ఆయన తమకక్కడే బాగుందన్నారు. చివరగా భక్తులు చొరవ తీసుకొని ఆయనను జబ్బలు పట్టుకొని తీసుకువెళ్ళి మశీదులో కూర్చోబెట్టారు. నాటినుంచి అదే వారి నివాసమైంది. అంతటితో ఆయన నిత్యమూ మశీదులోని కుండలతో దూరాననున్న బావినుండి నీరు తీసుకువచ్చి మశీదులో వుంచేవారు.

ఆ రోజులలో శిరిడీలో యిద్దరు సాధువులుండేవారు. దేవీదాసు 10,11 సం॥ల వయస్సులోనే విరాగిగా మారుతి ఆలయంలో వుండేవాడు. ఉజ్జ్వలమైన కళ్ళు, ప్రశాంతము, గంభీరమూ అయిన ఆయన ముఖం చూచేవారిని యిట్టే పాదాక్రాంతుల్ని చేసుకునేవి. గ్రామంలో తాత్యావంటి కొందరు ఆయనను గురువుగా తలచేవారు.

ఈయన, జానకీదాసు అనే వేరొక సాధువు గూడా సాయిపట్ల ఎంతో గౌరవంతో ఎక్కువసేపు ఆయన సన్నిధిలో గడిపేవారు.

బాబా ఒక్కొక్కసారి మూడుమైళ్ళలో వున్న రహటాకో, నీమ్‌గావ్‌కో వెళ్ళి సాయంత్రమయ్యేసరికి తిరిగి వచ్చేవారు. ఒకసారి రహటానుండి పూలమొక్కల విత్తనాలు తెచ్చి, ఆ వేపచెట్టు ప్రక్కనున్న నేలను త్రవ్వి వాటిని నారు వేసారు. వామన్ తాత్యా అనే కుమ్మరి ఆయనకు రెండు కుండలు యిచ్చాడు. ఆయన తమకు కావలసినవి కావాలంటే అవే సమర్పించాడు. ఆరోజు నుండి అతని బేరం అద్భుతం కాసాగింది. అందువలన అతడు ఆయనకు రోజూ రెండు కాల్చని కుండలిస్తుండేవాడు. ఆయన వాటితో ఆ ఊరి బావినుండి నీరు తెచ్చి, మొక్కలకుపోసి, సాయంత్ర మయ్యేసరికి ఆ కుండలు వేపచెట్టుక్రింద పెట్టగానే అవి విచ్చిపోయేవి. మూడు సం॥లలో అక్కడ చక్కని తోట మొలిచింది. - ఆయన ఉనికి వలన ఆ గ్రామం మహాశక్తివంతమైన క్షేత్రంగా రూపొందినట్లు, మనస్సనే నేలలో గురుభక్తిని నాటి, దివ్యలీలలనే జలంతో తడిపి, తపోవనం మొలిపించారు. చివరకు ఆ స్థలంలోనే ఆయన సమాధి మందిరం వెలసింది.

పుంతంబాకు చెందిన గంగగిర్ బాబా అనే గృహస్థ సాధువు ఆ ప్రాంతమంతటా ఆధ్యాత్మిక ప్రచారం చేస్తుండేవారు. ఒకసారి ఆయన శిరిడీ వచ్చి మారుతి ఆలయంలో భక్తులతో సద్గోష్ఠి చేస్తున్నారు. అంతలో భుజాన నీటి కుండలతో సాయి ఆ ప్రక్కగా మశీదుకు వెళుతుంటే చూచి గంగగిర్ ప్రసంగం ఆపి, లేచి నమస్కరించి, వారి వెనుకనే మశీదుకు వెళ్ళారు. అక్కడ సాయి కుండలు దింపి వెనక్కు తిరగ్గానే గంగగిర్ ఆయనకు నమస్కరించారు. బాబా పెద్దగా నవ్వి, "దేవాలయం యీ మశీదుకు వచ్చిందే! మంచిది. మనమిద్దరమూ ఒకే కుటుంబంలోని వారము. ఎంతో కాలంగా కలసి వుంటున్నాము. ప్రజలను సన్మార్గములో పెట్టమని భగవంతుడు మనలను పంపాడు. కాని యీ రోజులలో ప్రజలు కించిత్తుగూడా పరివర్తనం చెందడం లేదు. అందరూ క్షుద్రమైన విలాసాల మైకంలో చిందులేస్తుంటే, హరి మన నెత్తిపై ఆవుపాలు పెట్టి వారి మధ్యకు పంపారు. కొందరు నన్ను చూచి నవ్వి, పాలకుండపై రాళ్ళు విసురుతున్నారు. కొందరు నవ్వుతూ, 'అతడు చెప్పేది వినకండి, సాయి నన్ను పూనాడు' అని చెప్పి ప్రజలచేత ఈతకల్లు త్రాగిస్తున్నారు. నా దగ్గర పాలు తీసుకున్న వాళ్ళంతా పిచ్చివాడినంటున్నారు. కొందరు పాలు తీసుకొనిగూడా వేదాంత చర్చల్లో దిగి, పిచ్చివాళ్ళవుతున్నారు. సత్సంగం పట్ల విశ్వాసము, గౌరవమూ పోయి అసత్యాన్నే ఆదరిస్తున్నారు" అని ఎంతో బాధగా గంగగిర్ చేతులు పట్టుకొని, "పోయేవాడు పోతాడు, నిలిచేవాడే నిలుస్తాడు. చిత్త శుద్ధితో తరించే మార్గం చెప్పడమే మన పని" అని చెప్పి తమ ఆసనంపై కూర్చున్నారు. అప్పుడు గంగగిర్ తన భక్తులతో, "పేడకుప్పవంటి యీ గ్రామానికి ఎంతటి రత్నం లభించింది! నక్షత్రాలవంటి మహాత్ముల మధ్య ఈయన సూర్యుని వంటివాడు. మీరు పిచ్చివాళ్ళు గనుక ఈయనను విడచి ఎక్కడెక్కడో వెదుకుతున్నారు!" అన్నాడు. అలానే ఒకసారి శ్రీ అక్కల్కోటస్వామి శిష్యులైన శ్రీ ఆనందస్వామి యవలా దగ్గరనున్న సవర్‌గాంవ్‌లోని మఠంలో కొద్దిరోజులున్నారు. ఆయన పరమాత్మ సాక్షాత్కారం పొందిన మహాత్ముడు. అప్పుడు శిరిడీకి చెందిన మాధవ్‌రావ్ దేశ్‌పాండే, నందరామ్ మార్వాడీ, మొ॥న వారు ఆయనను దర్శించి తిరుగు ప్రయాణ మయ్యారు. అకస్మాత్తుగా ఆ స్వామి పరుగునవచ్చి, "నన్ను గూడ సాయి దర్శనానికి తీసుకుపోరా?" అని పిల్లవానిలా మారాంచేస్తూ టాంగా ఎక్కి కూర్చున్నారు. చివరకు శిరిడీ చేరాక ఆయన - సాయిబాబా ఒకరినొకరు చూచుకున్నారు గాని, ఏమీ మాట్లాడుకోలేదు. ఆయన , "ఈయన సామాన్యమైన రాయిలా కనిపించినా, గొప్ప వజ్రం! ఈ సంగతి త్వరలో మీకే తెలుస్తుంది" అన్నారు.

బాబాకు దీపాలు పెట్టడమెంతో యిష్టం. ఆయన రోజూ దుకాణాలలో నూనెతెచ్చి, రాత్రంతా మశీదులో దీపాలు వెలిగించి వుంచేవారు. రోజూ అలా నూనె యివ్వడం దండగని తలచి, ఒకరోజు ఆ వర్తకులు నూనె

లేదన్నారు. బాబా నిశ్చింతగా మశీదుచేరి, నీటితో ఆ డబ్బా కడిగి ఆ నీరు త్రాగేసారు. తర్వాత ప్రమిదలలో నీరుపోసి, వత్తులు వేసి వెలిగించారు. దీపాలు చక్కగా వెలిగాయి. గ్రామస్థుల హృదయాలలోని చీకట్లు తొలగి, ఆయనను క్షమాపణ వేడారు. "ఇష్టం లేకుంటే ఏమీ యివ్వనక్కరలేదు గాని లేదని అబద్ధం చెప్పవద్దు; యివ్వము అని చెప్పాలి" అని హితం చెప్పారు బాబా. ఈ లీల సంగతి ఆ ప్రాంతమంతా ప్రాకింది. మెరుపు, ఉరుమూ రానున్న కుంభవృష్టిని సూచించినట్లు, మానవాళికి ఆయన నుండి దివ్యలీలలు వర్షించనున్నాయని తెలిపే శంఖారావమైంది యీ లీల. నిజానికి ఆయన మశీదులో నివసించసాగాక ఆయన చరిత్రలో మరొక ఘట్టం ఆరంభమైంది. ఆయన తరచుగా నీమ్‌గాఁవ్‌లో త్రయంబక్ డేంగలే (ఉరఫ్ బాబాసాహెబ్ డేంగ్లే) యింటికి వెళ్ళేవారు. అతని సోదరుడు నానాసాహెబ్ డేంగలేకు పాపం రెండు వివాహాలు చేసుకున్నా సంతతి కల్గలేదు. కేవలం సాయి అనుగ్రహం వల్లనే బిడ్డలు కలిగారు. ఒకనాడు త్రయంబక్ డేంగలే పొలం పనులు చేయిస్తున్నాడు. ఒక కూలి మనిషి తన పసిబిడ్డను ఒక చెట్టు క్రింద నిద్రపుచ్చి పని చేస్తున్నది. అకస్మాత్తుగా వర్షం ఆరంభమయ్యే సరికి అందరూ ప్రక్కనున్న పాకలోకి పరుగెత్తారు. వెంటనే ఆ తల్లికి తన బిడ్డ గుర్తుకువచ్చి పరుగున వెళ్ళేసరికి, బిడ్డ ప్రక్కనే బాబా నిలబడి కాపలా కాస్తున్నారు! సాయి ఆమెను చూస్తూనే, బిడ్డ సంగతి మరిచినందుకు మందలించారు. ఆ తల్లి ఆత్రంగా బిడ్డనెత్తుకొనేలోగా అదృశ్యులయ్యారు బాబా. ఆ తర్వాత విచారిస్తే ఆ సమయంలో ఆయన శిరిడీలోనే వున్నారని తెలిసింది.

సాయి వేపచెట్టు క్రిందనున్నప్పుడు ఆయనకొక మత చిహ్నమే లేదు. కాని ఆయనను భక్తులు మశీదులో వుంచాక, ఆయన ముస్లిం అన్న సంకోచం కొందరికి కల్గసాగింది. సాయి దానినుండి తప్పుకోజూడలేదు. అది నేటి సమాజంలోని మతద్వేషాన్ని తొలగించమన్న భగవదాజ్ఞగా తీసుకున్నారు కాబోలు. ఓరిమితోను, పట్టుదలతోనూ దానిని ఎదుర్కొన్నారు. వేరుదారి లేనప్పుడు ఆయన లీలలే పరిష్కరించాయి.

ఈ లీలలకు రంగస్థలమైన ఆ శిధిలమైన మశీదు పట్టుమని రెండు గదులకు మించి వుండదు. మశీదులోని నేలలో మోకాలు లోతు గోతులుండేవి. అందులో ఈశాన్యం మూల కేవలమొక గోనెగుడ్డమీద సాయి కూర్చొనేవారు. ఆయన ఎదుట, ఆగ్నేయ దిక్కున ఆయన నిరతాగ్ని హోత్రము, లేక 'ధుని' నిర్వహించేవారు. తమ ఎడమ ప్రక్కనున్న అడ్డ చెక్కపై చేయి వుంచి బాబా తదేకంగా ధునికేసి చూస్తుండేవారు. దానికి పడమరగా నీటి కుండలుండేవి. వాటిప్రక్కనున్న గూటిలో ఆయన తమ చిలుం గొట్టాలనుంచుకొనేవారు. ఆయనకు కుడివైపు ఒక తిరుగలి వుండేది. దానితో ఆయన తరుచుగా గోధుమలు పిండిగా విసిరేవారు. అందుకోసం ఒక బస్తానిండా గోధుమలు, ఆయన పొగ పీల్చటానికి ఒక సంచిలో నాటు పొగాకు వుండేవి. పడమటి గోడలో గూడు (నింబార్)కు ఎదురుగా కూర్చొని తాము తెచ్చుకొన్న భిక్ష ఒక కుండలో వేసి కలిపి ముద్దలు చేసేవారు. మొదట అచటి భక్తులకు అదే ప్రసాదంగా యిచ్చి, చివరకు తామూ తినేవారు. ముస్లింలు నివేదన తెచ్చినప్పుడు ఆయన, 'ఫాతిహా' చదివించేవారు. ఒక్కొక్కప్పుడు తాముకూడ చదివేవారు.

భక్తులు తెచ్చిన పూలు నింబార్‌కి ఎదురుగా వ్రేలాడ తీసేవారు. మసీదు ముంగిట్లో ఎదురుగా ఒక తులసికోట స్థాపించారు. సాయి పంపే ప్రసాదం మతభేదం లేకుండా భక్తులందరూ తీసుకొనేవారు. మత సామరస్యానికి రంగస్థలమైన మశీదుకు ఆయన 'ద్వారకామాయి' అని పేరు పెట్టారు. ఆ పేరుకు అర్థం, "మతభేదం లేకుండా అందరికీ నాల్గు పురుషార్థాలకూ ద్వారాలు తెరచి వుండేది"అని స్కాందపురాణం చెప్పింది. 'అక్కడ ధుని ఎందుకు?' అని అడిగితే, "అందరి పాపాలు దహించడానికే!" అని సాయి చెప్పారు. కుల మత భేదాలకతీతమైనదే సాయి ధర్మమని, ఆయన నివాసమైన ద్వారకామాయి సూచిస్తుంది. నాటి స్మృతులు శ్యామా యిలా చెప్పాడు : "నేనప్పుడు బడిలో టీచరును. ఆయనపై నాకు విశ్వాసముండేది కాదు. రాత్రిపూట స్కూల్లోనే నిద్రించేవాడిని. మశీదులో

బాబా ఒక్కరే వుండేవారు. బడి కిటికీనుంచి మశీదు కనిపించేది. అందరూ పిచ్చి ఫకీరనే సాయిని ఆ కిటికీలోంచి నేను గమనిస్తుండేవాడిని. అప్పుడప్పుడు మశీదు నుండి ఇంగ్లీషు, హిందీ మొ॥గు భాషలలో ఎవరో మాట్లాడడం వినిపించేది. అది బాబాయే అయివుండాలి, కనుక ఆయన మహిమ గలవాడన్న విశ్వాసం నాకు కల్గింది.

సాయి కీర్తి వ్యాపించడం వలన ఒక సమస్య ఎదురయింది. కండపుష్టిగల మొహుద్దీన్ తంబూలీ అనేవాడు శిరిడీ ప్రాంతంలో తమలపాకులు, తాయెత్తులు అమ్ముకుంటుండేవాడు. అతనికి దివ్యశక్తులున్నాయని తలచి గ్రామస్థులు గౌరవిస్తుండేవారు. సాయి మహిమ వెల్లడవుతుంటే అతడు ఓర్వలేక ఒకనాడు "శిరిడీలో తానైనా వుండాలి, లేక సాయియైనా వుండాలి" అని తగవు పెట్టుకొని, ఆ విషయం కుస్తీ పోటీలో తేల్చుకోవాలని చెప్పి, బాబాపై కలియబడ్డాడు. అతడిదే పైచేయి అయింది. నాటి నుండి ఆ షరతు ప్రకారమే సాయి గ్రామంలోకి రాకుండా లెండీ ఏటి ఒడ్డున తోపులో వుండసాగారు. తాత్యావంటి భక్తులు ఆయనను అక్కడే సేవించుకొనేవారు. వాళ్ళెంతగా బ్రతిమాలినా సాయి గ్రామంలోకి రాలేదు. ఒకరోజు అకస్మాత్తుగా తంబూలీకి హృదయ పరివర్తన కలిగి, ఒక మహాత్ముని దర్గావద్ద సాత్వికంగా జీవించదలచి శిరిడీ విడిచి వెళ్ళిపోయాడు. అతని కండబలాన్ని బాబా ఆత్మబలము, ద్వేషాన్ని ప్రేమ జయించాయి. తర్వాత సాయి మరల మశీదుకు వచ్చారు.

ఐదు సం॥ల తర్వాత మరొక సంఘటన జరిగింది. అహమ్మద్‌నగర్ నుండి జవ్హార్ ఆలీ అనే ముస్లిం ఒకడు రహటా వచ్చాడు. అతడు పండితుడు. మంచి మాటకారి. త్వరలో అతడు ఆ గ్రామస్థులను ఆకట్టుకొని ముస్లిమ్‌లకు ఒక ప్రార్థనాస్థలము కట్టించసాగాడు. కాని అంతలో ప్రజలు అతని సంకుచితమైన మతదృష్టికి అసహ్యించుకొని ఆ ఊరినుండి వెళ్ళగొట్టారు. ఆలీ పారిపోయి వచ్చి శిరిడీలోని మశీదులో తలదాచుకొన్నాడు, కాని తన కుబుద్ధిని విడువలేదు. మంచి మాటలతో భక్తులను ఆకట్టుకొని త్వరలోనే సాయి తన శిష్యుడని చెప్పసాగాడు. బాబా గూడ ఓరిమి, వినయాలతో అలానే మెలగసాగారు. దీనిని ఆలీ వాడుకోదలచి బాబాను తీసుకొని వెళ్ళి రహటాలో వుండసాగాడు. వాళ్ళిద్దరూ అప్పుడప్పుడు శిరిడీ వచ్చి వెళుతుండేవారు. భక్తులు అది భరించలేక బాబాను శిరిడీ తెచ్చుకోవటానికి రహటా వెళ్ళారు. అక్కడ 'ఈద్గా' దగ్గర బాబా ఎదురై, "ఈ ఆలీ నన్నెలాగూ పంపడు. అతడు పంపక నేను రాకూడదు. అతడు ముక్కోపి. మిమ్ములను చూస్తేనే విరుచుకు పడతాడు. అతడు వచ్చేలోగానే మీరు తిరిగిపోవడం మంచిది" అన్నారు. అంతలో అతడు వచ్చి వారి తలంపు విని ఉగ్రుడయ్యాడు. చివరకు రాజీ కుదిరి, గురు - శిష్యులిద్దరినీ శిరిడీ తీసుకొచ్చారు. త్వరలోనే ఆలీ ప్రవర్తన నచ్చని భక్తులు అతనికీ, దేవీదాసుకూ వేదాంతచర్చ పెట్టారు. అందులో యువకుడైన దేవీదాసు ముందు వృద్ధుడు, పండితుడైన ఆలీ పరాభవము చెంది మరురోజే ఎవ్వరికీ చెప్పకుండా బీజాపూర్‌కు వెళ్ళిపోయాడు. తరువాత ఒకప్పుడు అతడు పశ్చాత్తాపము చెంది, భక్తిశ్రద్ధలతో బాబాను దర్శించాడు. బాబా మాత్రం అతనితో ఎంతో ప్రేమగా వ్యవహరించారు. ఆయన మొదటి నుండీ సాధువుకెంత నమ్రత, ఓరిమి వుండాలో తమ ప్రవర్తన ద్వారా తెల్పుతూనే వున్నారు. రమణ మహర్షి చెప్పినట్లు, "జ్ఞానిని జ్ఞానే గుర్తుపట్టగలడు" కాని, ఆలీ గ్రహించటానికి అంతకాలం పట్టింది. ప్రేమ, ఓరిమిలతో గూడిన సత్యమే జయించింది.

దేవిదాసు ఆ పరిసర గ్రామాలలో వైద్యం చేస్తుండేవాడు. ఒకనాడు అతనిని సాయి, "స్త్రీలకు సాధువెంతో దూరంగా వుండాలి" అని మందలించారు. కారణమేమో ఎవరికీ తెలియలేదు. కొద్దిరోజుల తరువాత ఒక శ్రీమంతురాలు అతని గురించి దుష్ప్రచారము చేస్తానని బెదిరించి అతనిని లోబరుచుకున్నది. అప్పుడు సాయి మాటలకు అర్థమేమో తెలిసి అతడు ఆ ప్రాంతమే విడిచి వెళ్ళిపోయాడు. జానకీదాసు మాత్రం సాయి హెచ్చరికలను జాగ్రత్తగా పాటించేవాడు. చివరకు అతడు శిరిడీనుండి వెళ్తుంటే భక్తులతనికి ఘనమైన వీడ్కోలు చెప్పారు. అప్పుడు అతని దివ్య వర్చస్సు వెలుగు రూపంలో మారుతి విగ్రహంలో లయమయింది.